ఓటర్ల ఉత్సాహం.. పెరిగిన పోలింగ్


కొటికలపూడిలో ఓటు వేసేందుకు లైన్‌లో వేచి ఉన్న మహిళా ఓటర్లు


కేతనకొండ ముస్లిం ఏరియాలో బారులు తీరిన మహిళలు


తిరువూరులో దివ్యాంగురాలు ఓటు వేసేందుకు సహకరిస్తున్న సుధారాణి, ప్రసాద్


కొటిలపూడిలో ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో వృద్ధుడిని తీసుకువస్తున్న కుటుంబ సభ్యులు

- రాత్రి వరకు కొనసాగిన ఓటింగ్
- ఉత్సాహంగా ఓటేసిన వృద్ధులు, మహిళలు
- మండుటెండను సైతం లెక్కచేయకుండా క్యూలో వేచి ఉన్న ఓటర్లు

తిరువూరు: తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గంలో సోమవారం ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 6.30 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారు. మండుటెండలో సైతం లెక్క చేయకుండా క్యూలో నిలబడి ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. మహిళలే అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో నిలబడి ఓటు వేశారు. పలు కేంద్రాల్లో ఈవీఎంలలో సాంకేతిక లోపం కారణంగా పోలింగ్ నత్తనడకన సాగింది. తిరువూరు మండలంలోని పల్లెర్లమూడిలో సాయంత్రం మూడు గంటలకే పోలింగ్ పూర్తయింది. తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల, అభ్యుదయ ప్రాథమికోన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 5 గంటల తర్వాత అధిక సంఖ్యలో ఓటర్లు రావడంతో క్యూ లైన్‌లో ఉన్నవారందరికీ ఓటువేసే అవకాశం కల్పించారు. ఎ. కొండూరు మండలం కంభంపాడులో ఎన్నికల సరళిని పర్యవేక్షించేందుకు కాన్వాయ్‌తో వచ్చిన టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్నిని స్థానికులు అడ్డుకోవడంతో వెనుదిరిగారు. తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు అభ్యుదయ స్కూల్ పోలింగ్ కేంద్రంలో, ఎమ్మెల్యే రక్షణనిధి తిరువూరు చింతల కాలనీ పోలింగ్ కేంద్రంలో, మాజీ ఎమ్మెల్యే దిరిశం పద్మజ్యోతి దంపతులు తిరువూరు సర్వోదయ స్కూల్ పోలింగ్ కేంద్రంలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

అనూహ్యంగా పెరిగిన పోలింగ్ శాతం

తిరువూరు నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ శాతం అనూహ్యంగా పెరిగింది. ఉదయం 9 గంటల వరకు 10 శాతం ఓటింగ్ పోలవగా, 11 గంటలకు 18.3 శాతం, సాయంత్రం ఐదు గంటలకు 74 శాతం, ఏడు గంటలకు 81 శాతం ఓట్లు పోలయ్యాయి. నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి మాధవి ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మానిటరింగ్ సెల్‌లో పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. సత్వరం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా అధికారులకు తగు ఆదేశాలిచ్చారు. తిరువూరు నియోజకవర్గంలో మొత్తం రెండు లక్షల ఏడు వేల 190 మంది ఓటర్లుండగా, వీరిలో లక్షా ఐదు వేల 190 మంది మహిళా ఓటర్లున్నారు.


మైలవరం నిమ్రా కళాశాలలో సోమవారం రాత్రి స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలిస్తున్న ఆర్‌ఓ సంపత్‌కుమార్


గంగినేని గ్రామంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

ఇబ్రహీంపట్నం మండలంలో..

ఇబ్రహీంపట్నం: మండలంలోని గ్రామాలు, కొండపల్లి మున్సిపాల్టీలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. అన్ని కేంద్రాల్లో ఉదయం నుంచి పోలింగ్ మందకొడిగా సాగింది. ప్రారంభం నుంచి మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు వినియోగించుకున్నారు. మూలపాడులో టీడీపీ నాయకులు విదేశాల్లో ఉన్న వ్యక్తి పేరుతో దొంగ ఓటుగా వేశారని వైఎస్సార్ సీపీ నాయకులు అడ్డుకున్నారు. కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. కొండపల్లిలో టీడీపీ జెండాతో కారు లోపలకు అనుమతించడం, పశ్చిమ ఇబ్రహీంపట్నంలో టీడీపీ డబ్బులు పంపకం వైఎస్సార్ సీపీ, టీడీపీ నేతల మధ్య స్వల్ప వివాదానికి దారితీసింది. వైఎస్సార్ సీపీ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు ఫెర్రీ బూత్‌లో పోలింగ్ సరళిని పరిశీలించారు. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ కేంద్రాల బయట గేటుకు తాళాలు వేసి లోపల ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించారు.

- **విస్సన్నపేట:** మండలంలోని 56 పోలింగ్ బూత్‌లలో సోమవారం ఓటు హక్కును ఓటర్లు వినియోగించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని పలు పోలింగ్ బూత్‌లలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లగట్ల స్వామిదాసు ఎన్నికల సరళిని పరిశీలించి ఓటర్లకు అభివాదం చేశారు. మండలంలో ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు.


తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో బారులు తీరిన ఓటర్లు

మైలవరం నియోజకవర్గంలో 78 శాతం పోలింగ్ నమోదు

జి.కొండూరు: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా మైలవరం నియోజకవర్గంలో సోమవారం జరిగిన ఎన్నికల ప్రక్రియలో 78 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, రెడ్డిగూడెం, విజయవాడ రూరల్ మండలాల్లో 296 పోలింగ్ బూత్‌లు ఉండగా గణపవరం మినహా అన్ని పోలింగ్ బూత్‌లలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సోమవారం ఉదయం ఏడు గంటలకు పారంభం కావాల్సిన ఎన్నికల ప్రక్రియ పలు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో ఆలస్యంగా ప్రారంభమైంది. వృద్ధులు, దివ్యాంగులు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహంతో బూత్‌లకు తరలివచ్చారు. విదేశాలు, ఇతర రాష్ట్రాలలో నివాసం ఉంటున్న పలువురు ముందుగానే తమ స్వస్థలాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు తన స్వగ్రామం మైలవరంలోని దేవునిచెరువు, తారకరామా నగర్ పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం పలు పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ సరళిని పర్యవేక్షించారు.

క్లుప్తంగా

ఆలస్యమైన పోలింగ్

రాత్రి 8 గంటల వరకు కొనసాగింపు



మునుకూరు: పలుచోట్ల ఈవీఎంల మొరాయింపుతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైందని తహసీల్దార్ జవహర్‌బాజి తెలిపారు. సోమవారం మండలంలోని 57 పోలింగ్ బూత్‌లలో 80 శాతానికి పోలింగ్ నమోదైంది. లోపూడిలో 68, అక్కిరెడ్డిగూడెంలో 58, 59, కాట్రేనిపాడులో 92, 93 పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించాయి. రాత్రి ఎనిమిది గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుంచే పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఎండ పెరిగిన కొద్దీ మందకొడిగా సాగిన పోలింగ్, నాలుగు గంటల తర్వాత తిరిగి ఊపందుకుంది. వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు సైతం తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసినట్టు తహసీల్దార్ తెలిపారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: గ్రామాల్లో సైతం ఉదయాన్నే ఓటు హక్కు వినియోగించేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. చెదురుమదురు ఘటనలు మినహా మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఆగిరిపల్లిలో కొండ కాలనీలోని పోలింగ్ బూత్ వద్ద సాయంత్రం సమయం గడిచినా టీడీపీ నాయకులు కొందరు ఓటర్లను ఓటు వేయడానికి లోపలకి పంపించాలని ఎన్నికల అధికారులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని వెనక్కి పంపించేశారు. మండలంలో నిర్ణీత సమయం దాటిన తర్వాత ఆగిరిపల్లి, వట్టిగుడిపాడులో రాత్రి 8:30 గంటల వరకు ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఎండ మండుతున్నా.. క్యూలోనే ఓటర్లు

గంపలగూడెం: సార్వత్రిక ఎన్నికలు సోమవారం మండలంలో ప్రశాంతంగా జరిగాయి. ఓటర్లు గతంలో కంటే అధిక సంఖ్యలో పోలింగ్‌కేంద్రాలకు తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం ఏడు గంటలకే గంపలగూడెం మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు బారులు తీరారు. ముఖ్యంగా మహిళా ఓటర్లు బూత్‌ల వద్ద ఎంతో ఓపికతో ఓటు వేసేందుకు గంటల తరబగి వేచి ఉన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే వరకు క్యూలోనే నిలబడి ఉన్నారు. కొన్ని పోలింగ్ బూత్‌ల వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు ఓటర్లు బారులు తీరి ఉండాల్సి వచ్చింది. దీంతో ఓటర్లు కొంత అసహనానికి గురికావాల్సి వచ్చింది. అనుముల్లంక, వినగడప, కొణజర్ల, పెనుగొలను, ఊటుకూరు, గోసవీడు తదితర గ్రామాల్లో సాయంత్రం ఆరు గంటల తర్వాత కూడా ఓటర్లు బారులు తీరి ఉన్నారు. సకాలంలో పోలింగ్ కేంద్రంలోకి రావడంతో వారికి అధికారులు ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించారు.

చెదురుమదరు ఘటనలు మినహా పోలింగ్ సమయం ముగిసే వరకు మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగలేదు. పోలీస్ శాఖాధికారులు, సిబ్బంది, సీఆర్పీఎఫ్ దళాలు తగిన చర్యలు చేపట్టారు.


గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఎండ వేడికి తాళలేక చెట్టునీడన కూర్చున్న ఓటర్లు


గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న స్వామిదాసు


పెనుగొలను పోలింగ్ కేంద్రం వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న డీఐజీ కె. రాజకుమారి


మేడూరు పోలింగ్ బూత్ వద్ద బారులు తీరిన మహిళలు

నూజివీడులో ప్రశాంతంగా పోలింగ్

నూజివీడు: నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మధ్యాహ్నం నుంచి ఎండ ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో ఉదయం 7 గంటల నుంచే ఓటు వేయడానికి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఈవీఎంలు మొరాయించడంతో అక్కడ ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలోని పోలింగ్ స్టేషన్‌లో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు, చంటినాయనలతో పాటు ఆయన సోదరుడి కుటుంబ సభ్యులు ఓట్లేశారు. పీజీ సెంటర్‌లోని ఈవీఎం కొద్దిసేపు మొరాయించింది. నూజివీడు మండలం తుక్కులూరులోని 197 పోలింగ్ స్టేషన్‌లో ఈవీఎం రెండు గంటల సేపు మొరాయించింది. అవి పనిచేసే వరకు ఓటర్లు క్యూలైన్‌లోనే నిలబడాల్సి వచ్చింది. జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి మండలంలోని మీర్జాపురం, గొల్లపల్లిలలోని పోలింగ్ స్టేషన్‌ల వద్ద బందోబస్తును పరిశీలించారు. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. నియోజకవర్గంలో 286 పోలింగ్‌స్టేషన్లలోనూ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. కొన్నిచోట్ల పోలింగ్ కేంద్రం లోపల ఉన్నవారంతా ఓట్లేసేందుకు అనుమతించారు. ఓటర్లు ఇబ్బందులు పడకుండా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద టెంట్లు ఏర్పాటు చేశారు. మంచినీటి వసతి కల్పించారు. ప్రాథమిక వైద్యం కేంద్రం ఏర్పాటు చేశారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఓటర్లను క్యూలో ఉంచడానికి ఏర్పాటు చేశారు.

చాట్రాయి: మండలంలో చిన్నపాటి ఘర్షణలు తప్ప పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మహిళలు బారులు తీరి తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. దివ్యాంగులు, వృద్ధులు మేము సైతం అంటూ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఏపీ కోఆపరేటివ్ యూనిన్ రాష్ట్ర ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి చాట్రాయి జిల్లా పరిషత్ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రంలో పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.


నూజివీడు మున్సిపల్ కార్యాలయంలో పోలింగ్ స్టేషన్ వద్ద బారులు తీరిన ఓటర్లు


చాట్రాయి పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు వేచి ఉన్న మహిళలు


నూజివీడులో వృద్ధురాలిని ఓటు వేయించేందుకు వీల్‌చైర్‌లో తీసుకొస్తున్న మనవళ్లు

ఓటేశాం.. స్ఫూర్తిగా నిలిచాం

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నడవలేని స్థితిలో ఉన్న దివ్యాంగులు, శతాధిక వృద్ధురాలు సైతం ఓటు విలువను గుర్తించి సహాయకులతో కలిసి పోలింగ్ బూత్‌లకు చేరుకుని ఓటు హక్కు వినియోగించుకుని ఎందరికో స్ఫూర్తిగా నిలిచారు. - తిరువూరు/మైలవరం


కుంటముక్కలలో ఓటు వేసిన మాజీ ఎమ్మెల్యే జ్యేష్ఠ రమేష్‌బాబు


తిరువూరులో దివ్యాంగుడిని మూడు చక్రాల సైకిల్‌పై పోలింగ్ కేంద్రానికి తీసుకు వెళుతున్న సహాయకులు


మైలవరంలో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధుడిని ఆప్యాయంగా పలకరిస్తున్న తిరుపతిరావు


గంపలగూడెం మండలం చింతనర్వలో ఓటు వేసేందుకు వచ్చిన 105 సంవత్సరాల గద్దల దానమ్మ


తిరువూరులో ఓటు వేసి వస్తున్న వృద్ధురాలు


ఇబ్రహీంపట్నంలో ఓట్లు వేసేందుకు వేచి ఉన్న మహిళా ఓటర్లు

అర్ధరాత్రి వరకు పోలింగ్

జి.కొండూరు: మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు మండల పరిధి వెల్లటూరు, కుంటముక్కల, హెచ్. ముత్యాలంపాడు గ్రామాలతో పాటు మైలవరం, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం, విజయవాడరూరల్ మండలాల్లోని పలు గ్రామాలలో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. జి.కొండూరు మండల పరిధి వెలగలేరులో మాత్రం అర్ధరాత్రి వరకు పోలింగ్ కొనసాగింది.వెలగలేరులోని మూడు బూత్‌లను ఒకే పాఠశాలలో ఏర్పాటు చేయడంతో ఓటర్లు బారులుతీరి ఎన్నికల ప్రక్రియ ఆలస్యమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైలవరం నియోజకవర్గంలోని 296 పోలింగ్ బూత్‌లలో నిర్వహించిన పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎంలను ఇబ్రహీంపట్నంలోని నిమ్రా కళాశాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌లలో భద్ర పరిచేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ ప్రక్రియను మైలవరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంపత్‌కుమార్ పర్యవేక్షించారు. ముందుగా పోలింగ్ పూర్తయిన ఈవీఎంలను ఒక్కొక్కటిగా పటిష్ట భద్రతతో స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు.

సర్ ఆర్థర్ కాటన్ హైస్కూల్ వద్ద ఉద్రిక్తత

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఎన్నికలు ఎప్పుడు జరిగినా భవానీపురం క్రాంబ్వే రోడ్‌లోని సర్ ఆర్థర్ కాటన్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయటం పరిపాటి. అయితే ఆ స్కూల్ ఇరుపార్టీల మధ్య ఘర్షణలకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ ప్రక్రియలోనూ ఆనవాయితీ తప్పకుండా వైఎస్సార్ సీపీ, టీడీపీ మధ్య గొడవ జరిగింది. ఉదయం పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి వల్ల గొడవ జరిగితే, సాయంత్రం ఒక టీడీపీ చోటా నాయకుడు పచ్చ చొక్కా వేసుకువచ్చి ప్రదర్శించిన అత్యుత్సాహం వలన చోటు చేసుకుంది. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. చూసుకుందాం అంటే..చూసుకుందాం అంటూ రెండు వర్గాలు పెద్ద ఎత్తున గొడవకు దిగారు. గొడవకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కారణమైతే తమ పార్టీ శ్రేణులను నిలువరించటమేమిటని పోలీసులతో వాగ్వివాదానికి దిగారు స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు ఎండీ ఇర్ఫాన్, యరడ్ల ఆంజనేయరెడ్డి, పలువురు పార్టీ నాయకులు. విషయం తెలిసిన డీసీపీ హరికృష్ణ తోపాటు సీఆర్‌పీ బృందం భారీగా మోహరించింది. టీడీపీకి చెందిన వర్గం రెచ్చగొట్టినా వైఎస్సార్ సీపీ వర్గం సంయమనం పాటించింది. ఒక దశలో రోప్ పార్టీ రంగంలోకి దిగి టీడీపీ వర్గాన్ని ఒక వైపు, వైఎస్సార్ సీపీ వర్గాన్ని మరో వైపునకు పంపించేశారు. ఇంతలో పశ్చిమ నియోజకవర్గ టికెట్ ఆశించి సుజనా చౌదరి రంగంలోకి దిగటంతో సైలెంట్ అయిపోయిన వ్యాపారవేత్త వక్కలగడ్డ భాస్కరరావు వచ్చి మమ్మల్ని తరిమేస్తున్నారుగానీ వైఎస్సార్ సీపీ వర్గానికి మీరు నచ్చచెప్పలేరంటూ పోలీసులను నిలదీశారు. తమకు ఏ పార్టీ అయినా ఒకటేనని ఆయనకి నచ్చ చెప్పేందుకు పోలీసులు ప్రయత్నించినా భాస్కరరావు ఊరుకోకుండా ఏదేదో మాట్లాడుతుండంతో సహనం కోల్పోయిన పోలీసులు గట్టిగా చెప్పడంతో వెనక్కి తగ్గాడు. దాదాపు గంటకుపైగా పోలీసులు అక్కడే ఉండిపోవడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. దాంతో ఓటర్లు వచ్చి ఓటు వేయాల్సిందిగా మైక్‌లో చెప్పారు. కాగా ఇంత ఉద్రిక్తతకు సూత్రధారి అయిన టీడీపీ చోటా నాయకుడిని ఆ పార్టీ పెద్దలు అక్కడి నుంచి తప్పించేయడం గమనార్హం.